కథ :

# సహృదయులు ★

రచన :-
శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి

గదిలో అటు ఇటు తిరుగుతున్నవాడల్లా గుమ్మంలో నీడపడటంతో ఆగి అటు చూశాడు. తరువాత టైము చూసుకున్నారు. సరిగా ఎనిమిదయింది.

"వెరీగుడ్, చెప్పిన ప్రకారం వస్తావో లేదో అనుకున్నాను. పంక్చుయలగా వచ్చావు. కూర్చో" అంటూ కుర్చీ చూపించారాయన.

బెరుగ్గా వచ్చి కుర్చీలో కూర్చుంది వసంత.

మళ్ళీ రెండు మూడుసార్లు గది కొలిచి గబుక్కునఆగి ఆ అమ్మాయిని తీక్షణంగా నఖశిఖ పర్యంతం పరీక్షించారు రావుగారు.

మెడలో ఒక వరస గొలుసు, ఒక చేతికి వాచి, రెండవ చేతికి రెండు బంగారపు గాజులు.... తెల్లటిచీర, తెల్లటిజాకెట్టు అందంగా, ఆరోగ్యంగా, కడిగిన ముత్యంలా ఉంది.

తలవంచుకుని కాలిబొటనవ్రేలితో నేల మీద రాస్తోంది.

ఆ అమ్మాయి భయంచూసి రావుగారికి నవ్వువచ్చి జాలివేసింది.

"చూడు వాసంతీ - నీకన్న వయస్సులో పెద్దవాడినికాబట్టి "నువ్వు" అనే సంబోధిస్తాను. నేనామాత్రం చనువు తీసుకోవచ్చును కుంటా" అన్నారాయన కొద్దిగా నవ్వుతూ।

"అది మీరు అడగాలా ?" అంది సిగ్గుపడుతూ వసంత.

"చక్కని గొంతు" అనుకున్నారు రావుగారు మనస్సులో। అంతలోకే సీరియస్‌గా—

"మావాడు నిన్ను ప్రేమించానన్నాడు। ఆ విషయం మాటాడదామనే నిన్ను పిలిపించాను.... మనం ఈ సందర్భంలో ఒక విషయం మర్చిపోకూడదు, "ప్రేమ" అంటే రెండక్షరాల మాటకాదని రెండు జీవితాల భవిష్యత్తుకి సంబంధించిన సమస్య అని. ప్రేమ అనేది గుడ్డిగా ఉండకూడదు. అలా ఉన్నవన్నీ మొదటి "తీపి" పోయిన తరువాత పశ్చాత్తాపాలకి దారి తీస్తాయి" అని ఆపి సిగార్ వెలిగించి రెండు గుక్కలు పొగ లాగారు. "చదువుకున్న చదువును సార్థకం చేసుకోగలవాళ్లు ఏపనితలపెట్టినా ఉభయతారకంగా ఉండేట్టు చూస్తారు.... నువ్వుకూడా చాలా తెలివిగల దానివని తోస్తోంది నాకు - ఏమంటావు?"

ఈ అభియోగానికి ఉలిక్కి పడింది వసంత.

"నాకు - మీరనుకునేటువంటి తెలివి తేటలులేవు. నన్ను మీరు అపార్థం చేసుకుంటున్నారు" అంది కొంచెం కోపంగా.

ఆయన ఆ మాటలు వినిపించుకోనట్టుగానే మళ్ళీ ప్రారంభించారు.

"ప్రతి తల్లిదండ్రులకి తమ సంతానం మీద ఎన్నో ఆశలు ఉంటాయి. ఇక తల్లిలేని సందర్భాలలో రెండు బాధ్యతలు తండ్రి మీదనే ఉంటాయి.... ఆ ఆశలు గాలిలోని పేకమేడలా కూలేందుకు ఏతండ్రీ అంగీకరించడు, సహించడు దాన్ని ఆపేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాడు- ప్రాణం విసిగితే వీళ్ళకి వ్యతిరేకంగా ఏం చేసేందుకయినా సిద్ధపడతాడు. నేనుకూడా ఇందుకు అతీతుణ్ణేం కాను.

తల్లయినా, తండ్రయినా నేనొక్కడినే వాడికి. కూతురయినా, కొడుకయినా వాడే నాకు. ఈ నాడు నాకు పదిలక్షలదాకా ఆస్తి ఉంది. దేశంలో కీర్తి. బంధువుల్లో గౌరవం ఉన్నాయి. అయినా వాణ్ణి చదివించాను. ప్రయోజకుణ్ణి చేశాను. కొద్దిరోజుల్లో డాక్టరు కాబోతున్నాడు వీడు. నా ఆశయాలు ఫలించబోతున్నాయి. మిగిలింది ఒక్కటే నా కోరిక - నా స్థాయికి, నా హోదాకి తగిన సంబంధంతెచ్చి వాణ్ణి ఒక ఇంటివాడిని చేయడం.... ఎంతెందరో నా చుట్టూ తిరుగుతున్నారు. లక్షాధికార్లు, జడ్జీలు, కలెక్టర్లు ఒకరేమిటి-ఆడపిల్లలున్న వాళ్ళకంటికి మావాడు బంగారపిచ్చుక ; అందుకే అన్నాను - నువ్వు తెలివిగల దానివని ;"

ఈ సారి వసంతకి బాగా కోపం వచ్చింది, కాని నోరు తెరిచేలోపల ఆయన మళ్ళీ ప్రారంభించారు.

"మొదటే చెప్పాను - మీ ప్రేమని ఆశీర్వదించలేనని.... నువ్వు అందమయిన దానివి, చదువుకున్నదానివి-నేను కాదనను. కాని అది నాలోని సంకుచిత్వమే అను, ధనకాంక్ష అను, మరేదయినా అను, నాకభ్యంతరంలేదు - నిన్ను నా కోడలుగా ఊహించలేకపోతోంది నా మనస్సు."

మాతాతలు సంపాయించిపోయిన ఆస్తి కాదిది। భగవంతుడిచ్చిన తెలివికి శరీరంలోని శక్తిని జోడించి కష్టపడి సంపాయించాను. అందువలన డబ్బు విలువ నాకు బాగా తెలుసు. అది సాధించే మార్గాలకి ఎవరు అడ్డునిలచినా నాప్రథమ కర్తవ్యం దాని నిష్కంటకం చేయటమే। మావాడికి ఇరవై వేలు ఇస్తామంటున్నారు. ఒక పాతిక సంవత్సరాల క్రితం. ఎవరికీ నాగాలి సోకేందుకుకూడా భయపడ్డానో అటువంటి ఆగర్భ శ్రీమంతులు నా కాళ్ళ చుట్టు తిరుగుతున్నారు. ।

నా కోరిక ఫలించాలంటే నువ్వు నాతో సహకరించాలి. నీ జీవిత మంతా హాయిగా గడిచే విధంగా మావాడితో సమానమయిన వాడిని నేను తెచ్చి నీకు పెండ్లి చేస్తాను.—

"మీరు చాలా పొరపడుతున్నారు. ప్రేమని డబ్బుతో కొలవ చూస్తున్నారు. అవును లెండి - అది మీ తప్పు కాదు. ఈ ప్రపంచం తీరే అంతా." అంది బాధగా.

"తొందర పడకమ్మా - ఆవేశపడి సాధించకలిగినపనులు కొద్ది. ఆలోచించు నిన్ను నాకూతురులాగా సారె చీరలతో సాగనంపుతాను. నీ ముద్దు ముచ్చట తీరుస్తాను. .."

"మా నాన్నగారు మా అమ్మని ప్రేమించి పెండ్లి చేసుకున్నారు." అంటుండేవాడు మీ అబ్బాయి శర్మ. ఇదేనా ప్రేమకి అర్థం, డబ్బు ఆశ చూపిస్తే మీరామెను త్యజించేందుకు సిద్ధపడేవారా ? "ఆవేశంతో అనేసి అంతలోనే సంబాళించుకుని "క్షమించండి, ఆవేశంలో ఏదో అనేశాను" అంది వసంత.

కాసేపు ఆమె ముఖంలోకి చూశారు రావుగారు.

"అయితే నామాట విననంటావు. పర్యవసానం ఏమిటో తెలుసా ?.... నా ఆస్తి చిల్లిగవ్వ మీకివ్వను. ఇదంతా నా స్వార్జితం. అనాధ శరణాలయానికి రాశాను. ఇదుగో నా వీలునామా. మొత్తం ఆస్తి నా తదనంతరం 'అర్ఫనేజి'కి చెందాలని రాశాను. కావాలంటే చదువుకో !" అంటూ చేతిలోఉన్న కాగితాన్ని ఆమె ముందు బల్లమీద పడేశారు.

వాటి వంకయినా చూడలేదు వసంత.

"చాలా సంతోషం. మీకు మీకొడుకు మీది కోపంవల్లనయినా ఒక మహత్తర పుణ్యకార్యాన్ని తలబెట్టారు. పరోక్షంగా దానికి కారకురాలినయిన నేను అదృష్టవంతురాలిని. ఈరోజే దాన్ని రిజిష్టరు చేయండి. ఆడబ్బు చేతిలోంచి పోయాకనయినా వ్యక్తులవిలువలు, ప్రేమకి అర్థం తెలుస్తాయి."

"అంతేగానీ నా మాట విననంటావు. డబ్బు లేకపోయినా ఫరవాలేదంటావు?"

"ఈ ఒక్క విషయంలో మట్టుకు మీ మాట వినను నాకు కావలసింది డబ్బు కాదు - వ్యక్తిగా ఆయన. నేను ప్రేమించింది ఆయనకి మీరు సంపాయించిన ఆస్తికాదు - ఆయన మనస్సుని. నేను మీ స్తోమతుకి తగినదాన్ని కాను. ఆ "అంతస్థు" కి నేను చేరుకోవడంకూడా అసంభవం. కాని మీరు సహృదయులు కాబట్టి మీ అబ్బాయిని 'నా' అంతస్థుకి తేవడం నిజంగా నా అదృష్టం. ఇక మీదట మా ప్రేమకి 'డబ్బు' అనేది ఒక అడ్డంకిగా ఉండదు. అందుకు మట్టుకు మీకు ఋణపడి ఉన్నాను"

"నువ్వామాటలు మనస్ఫూర్తిగా అంటున్నావా ?"

"నా మనస్సుకి ఆ భగవంతుడే సాక్షి" అంది నిశ్చలంగా వసంత.

ఒక్క అయిదు నిముషాలు ఎవ్వరూ మాట్లాడలేదు, చివరికి ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ మళ్ళీ ప్రారంభించాడు రావుగారు.

"నేనూ ప్రేమించే పెళ్ళిచేసుకున్నాను. మాది అమర ప్రేమ. అప్పట్లో నేను దమ్మిడీ ఆస్తిలేనివాడిని. అయినా సావిత్రి నన్ను తప్ప ఇంకొకరిని కన్నెత్తి చూడనంది. వాళ్ళనాన్న తిట్టాడు, కొట్టాడు. "దమ్మిడి ఖరీదు చేయనివాడితో ప్రేమ ఏమిటని" బలవంతాన మరొకరి కిచ్చి వివాహం చేసేందుకు ప్రయత్నించాడు. ఆనాడే మా అదృష్టంమీద నమ్మకముంచి ఇద్దరం పరారయ్యాం. 'లక్ష్మి' లాంటి సావిత్రి నాపక్కనఉండగా నాకేంకొరత? నేనూ ప్రయోజకుడి నయాను. కీర్తి సంపాయించాను. నా అదృష్టానికంతకూ కారణం సావిత్రి. సావిత్రి కండ్లలో ఉంది సిరి !

మూడు సంవత్సరాల మా మధుర దాంపత్యానికి చిహ్నంగా వీడినినాకు ప్రసాదించి స్వర్గానికి చేరుకుంది సావిత్రి. ప్రపంచం అంతా గాడాంధకారంగా తోచింది ఆనాడు. ఈ మూడు సంవత్సరాలు నన్ను చంటి పిల్లాడిలా చూసింది. అడుగడుగునా నాకు ధైర్యాన్నిచ్చి నన్ను ఉన్నతికి తెచ్చింది. "కార్యేషు దాసి, కరణేషు మంత్రి." అన్న మాట అక్షరాలా ఆమెపట్ల సత్యం.

పిల్లాడ్ని చూసుకుని ఆమెతో పోలేక నిలిచిపోయాను. "వీడిని మీ అంత వాడిని చేసే బాధ్యత మీది" అంటూ అప్పగించింది నాకు" నా మీద అంత నమ్మకం, ఉన్నవాదిప్రాయం ఉన్నాయి సావిత్రికి !

నన్ను మళ్ళీ పెండ్లి చేసుకోమన్నారు అంతా. నా ఆస్తిచూసి ఆడపిల్లలతోసహా తరలి వచ్చారు తండ్రులు. కాని సావిత్రి ఏర్పరచిన లోటు ఒకరు తీర్చేదికాదు ! పైగా నేనిచ్చిన మాట నిలబెట్టుకోవాలి !

వాడిని నేనే స్వయంగా సాకేను. నిద్ర పోనేవాడిని. అసహ్యం లేకుండా వాడిపన్నీ శుభ్రం చేసేవాడిని. చొక్కాలో పాలసీసా పెట్టుకుని వాళ్ళ అమ్మలాగానే పక్కలో పడుకుని పాలు ఇచ్చేవాడిని. ఇవన్నీ చెబితే నవ్వుతారు ఇప్పుడు !

స్వయంగా చదువు చెప్పాను. వాడు శ్రీమంతుడి బిడ్డఅన్న ఊహ వాడికి రానియ్యలేదు - ఎందుకు ? చదువు అబ్బదేమోనన్న భయం. సావిత్రికి అన్యాయం చేసినవాడి నవుతానన్న భయం. నేనుపడిన కష్టంవల్ల నయితేనేమి, వాడితల్లి ఆశీర్వచనం వలననేనే - వాడూ ప్రయోజకుడయాడు ఇంతవరకు ప్రతిదానికి నామీదనే ఆధార పడేవాడు నా మాటని ఏనాడూ కాదనలేదు, అది వాడికి వేదాక్షరమే?" ఆయనకండ్లు నీళ్ళతో నిండిపోయాయి. గొంతు పూడి పోయింది.

ఆయన స్థితి చూసి వసంత చలించి పోయింది

"ఈ నాటికి - ఈనాటికి మరిదాటాడు ! నన్నుగూడా ఎదిరిస్తున్నాడు ఎవరికోసం? నీకోసం. అయిపోయింది, అంతా అయిపోయింది. నా అవసరం వాడికి తీరిపోయింది, నేను పడ్డ శ్రమ అంతా వ్యర్థమయిపోయింది. వాడ్ని ప్రయోజకుడినయితే చేయగలిగాను కాని చివరికంటా నా మాట పాటించేట్టు చేయలేక పోయాను. సావిత్రికి నేనిచ్చిన మాట దబ్బర కాబోతున్నది. నా ఆశలన్నీ కూలిపోయాయి ఒక జడ్జీగారికి మాట ఇచ్చాను. జీవితంలో మొదటిసారిగా నా మాట దబ్బర కాబోతున్నది !"

ఆయన పరిస్థితి చూసి వసంతకి దుఃఖం ఆగలేదు-" వద్దు, వద్దు- అలా ఎన్నటికీ

జరగదు" అంటూ చేతులతో ముఖం కప్పుకుంది.

"నేనందుకు బాధ పడను. వాడూ పెద్ద వాడయ్యాడు. నాతో వాడికి ఋణం తీరి పోయింది. వాడి బాధ్యత ఇక నీదే! నే వెడతాను. సుఖంగా ఉండండి"

ఆయనకి అడ్డంగా నిలబడింది వసంత.

"వద్దు. మీరు తండ్రిలాంటి వారు. మీరు బాధపడితే అది నాకూ శ్రేయస్కరంకాదు. నేను ఎంతసేపూ మా ప్రేమ గురించే ఆలోచించాను. దానికి మీరు అడ్డంగా ఉన్నారని మీ మీద కోపించాను. కాని అంతకన్న ఉన్నతమయినది 'పుత్రి ప్రేమ' అని-తెలుసుకోలేక పోయాను. కని, పెంచిన మీకు ఆయన మీద ఉన్న హక్కును గుర్తింప లేకపోయాను. క్షమించండి-మీ దారికి, ఆశలకి నేను అడ్డుగా నిలవను-నిలవలేను. నన్ను ఆశీర్వదించండి శలవు! గద్గదికంగా అని మెల్లిగా బరుగా వీధి వైపుకు నడువ సాగింది వసంత.

గబుక్కున ఆమె చేయి పుచ్చుకుని ఆపి వెనక్కి తిప్పారు రావుగారు. ఆమె గడ్డం కింద చేయి వేసి ముఖం పైకెత్తారు.

-కళ్లవెంట ఏకధారగా కన్నీళ్లు కారి పోతున్నాయి. మూర్తీభవించిన శోక దేవతాలా ఉంది.

"ఛ, ఛ. పిచ్చిపిల్లా! హృదయం ఇంత మెత్తటిది అవటం వల్లనే మిమ్మల్నిలా ఏడిపస్తున్నారమ్మా మగవాళ్లు. కళ్లు తుడుచుకో!"

వసంత తెల్లపోయింది ఈ అనుకోని మార్పుకి,

"ప్రేమ కోసం దేన్నయినా త్యాగం చేయగల శక్తి ఉండాలి. అలాగని చెప్పి దానికోసం ఎన్ని జీవితాలు బలి అయి పోతున్నా లెక్క పెట్టకూడదని కాదు. ఉన్నతమయిన లక్ష్యం ఉన్నప్పుడు ప్రేమని కూడా త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉండాలి.

నీకా శక్తి ఉన్నదా లేదా అని పరీక్షించాను. నా ఊహ కందని త్యాగం, నవనీతం లాంటి హృదయం ఉన్నాయని చూపించావు.... ఇవుగో ఇంటి తాళాలు. ఇక ఈ ఇంటికి అధికారిణివి నువ్వు. ఇన్నాళ్లు వాడిని నేను పెంచాను. ఇక మీదట వాడ్నీ, నన్నూ కూడా పెంచవలసిన బాధ్యత నీది."

వసంత ఆనందానికి అంతు లేదు. "మామగారూ" అంటూ ఆయన కాళ్లమీద వాలిపోయింది.

ఆమెని లేవదీసి- "వాడిని నా అంత వాడిని చేశాను, సావిత్రికి నేనిచ్చిన వాగ్దానం అక్షరాలా నెరవేరింది. ఇవాళే ముహూర్తం పెట్టిస్తాను" అన్నారాయన ఆమె తల నిమురుతూ.

అప్పుడే వచ్చి గుమ్మంలో నిలబడి ఈ తంతు చూస్తున్న శర్మ ఆశ్చర్య పోయాడు. "రాత్రి తనని నానా చివాట్లు పెట్టిన ఈయన...."

కొడుకుని చూసి రావుగారు-

"ఇదుగో వెధవ్వేషాలు వేయక ఇక నుంచి అమ్మాయి చెప్పిన విధంగా నడుచుకో- తెలిసిందా? డబ్బు కావలిస్తే కోడల్ని అడగాలి ఆఁ!" అంటూ బయటికి వెళ్లిపోయారాయన.

"నిజంగానా!" అన్నాడు శర్మ మెల్లిగా

సిగ్గుతో తలవంచుకుంది వసంత!

—o—

# నదీ గీతము

రచన:- శ్రీ టి. బి. యం. అయ్యవారు యం. ఏ.

చల దూర్మి మాలికో
జ్వల పృషత్తుల చలువ
దిశ లెల్ల క్రిమ్మ కొన
వసుధపై ప్రవహింతు

ఎవ్వడో సన్నావు
నీ క్షోణి తలమందు.

నా తరంగా నీక
నాద మాధుర్యాప
భుజగాంగనలు హర్ష
మున వివశలై పోవ

జల జలా ప్రవహింతు
గల గలా ప్రసరింతు.

విశ్వమంతయు విరహ
విధుర ఘోషల ముంచు
ప్రాణపతి సాగరునిఁ
బాసి యిన్నాళ్లంటి

జాగుసేయగ లేను
సాగి పోయెద నేడె

కర్మ యోగులు హోలి
క శ్రేష్ఠులేమైరా
నా ముద్దు బిడ్డ లు
ద్దా మత భావహ్వ

వారి మోములె దృష్టి
పధ మందునను వ్రేలు

నను నిలువరింపంగ
మనసులో నెంచెదరె!
ఘన గిరీంద్రములార
జనన హేతువు లార!
అస్మన్మహో వర్త
హారి ప్రదక్షిణము
లాత్మ భావించిన
న్నడ్డ గింపకుడయ్య!

కరుణా హృదయులార!
ధరణీ ధరములార!

సకల ప్రజానీక
సమ్మోద ఘటనమ్మె
యుగ యుగమ్ముల ధర్మ
ముగ నాకు చెల్లినది

సుతులకై దేహమే
గతియైన చింతింప-

స్వాదిష్ఠ ఫల రసా
మోద నిర్భర చారు
మేదినీజములార
మోదమున రారండు!

పంచి యిత్తము ధరా
ప్రజలకు పువ్వులు పండ్లు.

—:O:—